# టైగర్ హిల్


దాని పేరే పులికొండ (టైగర్ హిల్).

అలాగని అక్కడ మనకు పులులేమీ కన్పించవు. పులి ముఖంలా ఉన్న ఆ కొండశిఖరం ధీమాగా కనిపిస్తుంది. అటుపైన అక్కడ చలి పులి పంజా లాంటి మంచుగాలుల తాకిడి ప్రాణాంతకంగా ఉంటుంది.

శ్రీనగర్–లే జాతీయ రహదారికి టైగర్‌హిల్ ఆయువుపట్టు లాంటిది. అక్కడ తిష్టవేసుకున్న శత్రువులు సులువుగా మన వాహనాలను ధ్వంసం చేయగలుగుతున్నారు. ఎన్నో మిలటరీ వాహనాలు శత్రువుల ఫిరంగి గుళ్లకు తునాతునకలైపోయాయి. అందులోని అత్యవసర సామాగ్రితో బాటు వీరజవాన్లు కూడా ఆహుతయ్యారు.

ఇక భారతసైన్యం టైగర్‌హిల్ మీద దృష్టి పెట్టింది. అక్కడి శత్రువులను అంతమొందిస్తేగానీ మన వాహనాలకు భద్రత ఉండదు. సాహసానికి మారుపేరైన 8–సిక్ రెజిమెంటుకి ఆ బాధ్యత అప్పగించబడింది.

అప్పటికే పలుసార్లు టైగర్‌హిల్ స్థావరాలమీదకి ఫిరంగులు, శతఘ్నుల గుళ్ల వర్షాన్ని కురిపించడంతో శత్రువుల్లో చాలా భాగం చనిపోయారు. కేవలం ముగ్గురు ప్రాణాలు దక్కించుకుని, చివరి పోరాటం



# సిపాయి కథలు



చేస్తూ, మన సైన్యానికి చీకాకులు కలిగిస్తున్నారు.

ఆ ముగ్గుర్నీ మట్టుబెట్టే బాధ్యతను 22 సంవత్సరాల సిపాయి రస్వీందర్‌సింగ్‌తో బాటు, మరొక జవానుకి అప్పగించారు. జాట్ సిక్కులు నాగలి కంటే తుపాకీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. రస్వీందర్‌సింగ్ జాట్ సిక్కుజాతికి చెందినవాడు. అతనిలో వ్యాఘ్రశౌర్యం దాగి ఉంది. అమాయకంగా కనిపించే ఆ మొహం వెనుక దృఢ దీక్ష, పట్టుదల దాగి ఉన్నాయి.

సరిహద్దులకు సమీపంలో పంజాబ్‌లోని మన్నా జిల్లాలో వర్షాలు సరిగా పడని గ్రామం గూర్ఖానీ. అక్కడ ఎప్పుడో గానీ పంటలు పండవు. హర్‌చరణ్ సింగ్ తన కుటుంబంతోబాటు చాలాకాలంగా ఆ గ్రామంలో నివసిస్తున్నాడు. ఆ ఊళ్లో 900 సుమారు ఇళ్ళు ఉంటాయి. అందరూ కష్టజీవులే. ఎంత కష్టపడ్డా పెద్దగా ఫలితం ఉండేది కాదు. ఆ కారణం చేత యువకులు సైన్యంలో చేరి గౌరవంగా బ్రతకడానికి ఉత్సాహం చూపుతుంటారు. హర్‌చరణ్ సింగ్ కొడుకు రస్వీందర్ సింగ్ కూడా బీడుపొలాలలో శ్రమించడం కంటే దేశ సరిహద్దుల్లో ధైర్యసాహసాలతో జీవించడానికి మొగ్గు చూపాడు.

ఒకప్పుడు గూర్ఖానీ గ్రామానికి తీవ్రవాదుల తాకిడి, పోలీసుల సోదాలు ఎక్కువగా ఉండేవి. పోలీసు డైరెక్టర్ జనరల్ గిల్ పుణ్యమా అని పంజాబ్‌లో తీవ్రవాదం తుడిచిపెట్టుకు పోయింది. ఇప్పుడు ఆ గ్రామంలో వీరజవానులు, అమరజవానులూ అధికంగా ఉన్నారు.

రస్వీందర్ సైన్యంలో చేరి, శలవులకు వచ్చేటప్పుడు తల్లిదండ్రులకు అనేక బహుమతులు తెచ్చేవాడు. మిత్రులక్కూడా కొన్ని బహుమతులిచ్చేవాడు. అందరూ అతన్ని ఎంతో ఆత్మీయంగా చూసేవారు. ఇటీవల శలవు మీద వచ్చినప్పుడు రైఫిల్‌తో ఫొటోలు దిగాడు. అతను ఊళ్లో లేనప్పుడు ఆ ఫొటోలు చూసుకుంటూ తృప్తిపడుతుంటారు తల్లిదండ్రులు, ఆత్మీయులు.

ఇప్పుడు మళ్లీ మనం ద్రాస్‌రంగంలో ఉన్న టైగర్‌హిల్ ప్రాంతానికి తిరిగివద్దాం. వ్యూహాత్మకమైన టైగర్‌హిల్ మీద శత్రువులు పటిష్టమైన బంకర్లు నిర్మించుకున్నారు. ఫిరంగి గుళ్లకు కూడా అవి చెదరవు. అలాంటి వాటిల్లో దాక్కు

**కాటూరు రవీంద్రత్రివిక్రమ్**

ని, మన సైన్యానికి తీవ్రనష్టం కలిగిస్తున్నారు.

అసలు శత్రువులు వ్యూహాత్మకమైన ప్రత్యే కత కలిగిన టైగర్‌హిల్స్ మీద స్థావరాలు ఎలా ఏర్పరచుకున్నారు? అక్కడ మన స్థావరాలు, నిరంతర పహారా ఏర్పాట్లు లేవా? దానికి జవా బు ఇదీ -

లాహోర్ శాంతి సమావేశానికి అధిక ప్రాధా న్యమిచ్చి, మన ప్రభుత్వం భారీ సంఖ్యలో సరి హద్దు స్థావరాల నుంచి భద్రతా దళాలను ఉప సంహరించింది. పాకిస్తాన్ ఇదే కోరుకుంది. ముషర్రఫ్ కీలకమైన సరిహద్దు స్థావరాలు సందర్శించడాన్ని కూడా హెచ్చరికగా తీసుకోక పోవడం మరొక తప్పు. ఫలితంగా ఎలాంటి ఇబ్బందీ లేకుండా శత్రువులు మన హద్దుల్లోకి ప్రవేశించి, మనకు మున్నెన్నడూ లేనంత నష్టా న్ని కలిగించారు. అవసరానికి మించిన సైనిక దళాల వినియోగం, అధికాధికంగా జవాన్ల మరణం సంభవించింది.

ఇవే చరిత్ర నేర్పే గుణపాఠాలు.

గుడ్డినమ్మకాలెప్పుడూ గోతిలోకి పడదో స్తాయి. అలాగే ప్రతీదీ అనుభవంతో నేర్చుకునే ప్రయత్నం చేయకూడదు. ముందు జాగ్రత్తలు, గమనిక, హెచ్చరికగా ఉండడం ఎంతో మేలు చేస్తాయి.

❁ ❁ ❁

రస్వీందర్ సింగ్ తన సహచరుడితో బాటు మెల్లగా టైగర్‌హిల్ మీదకు ఎక్కడం ప్రారంభిం చాడు. శిఖరం మీద తిష్టవేసుక్కూర్చున్న ము గ్గురు ముష్కరులూ గురిచూసి వారిద్దరి మీదా తూటాలు పేల్చసాగారు. వాటిని తప్పించుకుం టూ, ఎదురుకాల్పులు జరుపుతూ పైకి ఎక్కు తున్న రస్వీందర్‌ని సహచరుడు అనుసరిస్తు న్నాడు.

సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తుంటారు. వారి వీరగాధలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.

ఈ కథలు వాస్తవ సంఘటనల నేపధ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు (16 సం॥లు) వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధ వీరుల విజయగాధల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ ప్రత్యేక కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

యవ్వనంలో ఉన్న మగపులి క్రోధంగా వేట కోసం వెళుతున్నట్లు రస్వీందర్‌సింగ్ శత్రువుల వైపు ఆచితూచి అడుగులేస్తూ వెళ్తున్నాడు. తోటి జవానుకి రస్వీందర్‌సింగ్ సాహసమనస్తత్వం గురించి బాగా తెలుసు. భయం అనేది అతనికి తెలియదు.

"మనిషికి మరణం ఒక్కసారే రావాలి. పిరి కితనంతో ప్రతిరోజూ చావకూడదు" అనేవాడు.

ఫైరింగ్ ప్రాక్టీస్‌లో అత్యధిక మార్కులు సం పాయించేవాడు రస్వీందర్.

దాదాపు తూటాలు అన్నీ లక్ష్యంలోకి సూటి గా దూసుకుపోయేవి.

"అంత కరెక్ట్‌గా ఎలా షూట్ చేయగలుగు తున్నావ్?" అనడిగితే,

నవ్వి "మిత్రమా! శత్రువుని మన తూటా చంపకపోతే, అతను మనల్ని చంపేస్తాడు. అందువల్ల షూటింగ్‌లో చిన్నపొరబాటు కూడా చేయను" అనేవాడు. అతని ప్రతిభకి అనేక

పతకాలు, బహుమతులు వచ్చాయి.

ఏకాంతంలో ఉన్నప్పుడు తన గ్రామం గురించి, తల్లిదండ్రుల గురించీ మాట్లాడేవాడు. తన బాల్యస్నేహితులతో ఆటలు... అందులో తను సిపాయి పాత్రధరించి, చిన్న కర్రను తుపాకీలాగా పట్టుకుని, ఎదురుగా శత్రువుల్ని ఊహించుకుంటూ, నోటితోనే తూటాలు పేలుతున్న శబ్దాలు సృష్టించడం... అది చూసి తల్లిదండ్రులు మురిసిపోవడం... ఇవన్నీ గుర్తుచేసుకుంటూ చెబుతుండేవాడు రస్వీందర్.

అతనికి తాతగారి పేరు పెట్టారు. ఆయన మంచి సాహసికుడు, బలశాలి. పదెకరాల పొలాన్ని ఒక్కడే దున్నేవాడు. వ్యవసాయం అంతా ఆయనే చూసుకునేవాడు. ఆయన కాలంలో వర్షాలు బాగానేపడుతుండేవి. అందువల్ల గోధుమలు బాగా పండేవి.

వచ్చేపోయే బంధువులతో ఇల్లు సందడిగా ఉంటుండేది.

ఆయన నవ్వు ఊరంతా వినిపించేంత పెద్దగా ఉండేది.

అప్పుడప్పుడూ సరదాగా చిన్నపిల్లలతో ఆటలాడేవాడు. ఆట ముగిసిన తరువాత చాలాసేపు ఆలోచిస్తూ ఏకాంతంగా గడిపేవాడు. బహుశః బాల్యం గుర్తుచేసుకునే వాడేమో...

మనవడికి తనపేరే పెట్టడంతో రస్వీందర్‌ని వదిలి ఉండేవాడు కాదు. కితకితలు పెట్టి నవ్విస్తూండేవాడు.

రస్వీందర్‌కి ఇప్పటికీ ఆ పులకింతలు గుర్తే.

❁ ❁ ❁

"దగ్గరకు వచ్చేసాం మిత్రమా!... ఇక ప్రతి అడుగూ జాగ్రత్తగా వెయ్యాలి. శత్రువులు మనల్ని పసిగట్టారు. నేరుగా మనమీదకే కాల్పులు జరుపుతున్నారు" హెచ్చరించాడు రస్వీందర్. అలా అంటూనే శత్రువుల మీదకి గురి చూసి



రస్వీందర్‌సింగ్

తూటాలు పేల్చాడు. ఒకరి తరువాత ఒకరు... ఇద్దరు శత్రువులు కూలిపోయారు. మరొకడు మిగిలాడు. కోపంతో కసిగా మెషీన్‌గన్‌తో తూటాలు గుప్పిస్తున్నాడు.

రస్వీందర్ అతని మీదకు గురి చూసి ట్రిగ్గర్ నొక్కాడు. సూటిగా వెళ్లి తాకింది. అదే సమయంలో అతని తుపాకీ నుంచీ తూటా వచ్చి రస్వీందర్ నుదుటిలోంచి దూసుకుపోయింది.

❁ ❁ ❁

గుర్ఖానీ గ్రామం అర్ధరాత్రి నిద్రమత్తులో జోగుతోంది.

హర్‌చరణ్ సింగ్ ఉలిక్కిపడిలేచాడు.

ఎవరో బలంగా తలుపు తడుతున్నారు. ఎవరై ఉంటారు? ఇప్పుడు ఉగ్రవాదం ఉనికి లేదు కాబట్టి పోలీసులయి ఉండరు. ఇంకె వరు?!

మళ్లీ తలుపు తట్టిన చప్పుడు.

ధైర్యంగా వెళ్లి తలుపుతీసాడు.

ఎదురుగా యూనిఫారంలో ఉన్న సిపాయిలు.

హర్‌చరణ్ ఏదో అడిగేలోగానే త్రివర్ణపతాకం కప్పిన శవపేటికను లోపలికి తీసుకొచ్చారు. నేల మీద ఉంచి, గౌరవవందనం చేసారు.

"మీ అబ్బాయి రస్వీందర్ వీరస్వర్గమలంకరించాడు"

ఆ మాటలు వింటూ నిలబడిన చోటే నిస్సత్తువుగా కూలబడిపోయాడు హర్‌చరణ్. అంతలో భార్య కూడా ఆతృతగా వచ్చి విషయం తెలుసుకుని బావురుమంది.

"ఏడవకు. ఏడ్చి, మన పుత్రుడి త్యాగాన్ని అవమానించకు" అన్నాడు హర్‌చరణ్ దుఃఖం దిగమ్రింగుకుంటూ.

ఆ తరువాత మిగతా కార్యక్రమాలు యథావిధిగా జరిగాయి.

హర్‌చరణ్ శిథిలమవుతున్న ఇంటిని బయటనుంచి చూస్తూ కొడుకు మాటలు గుర్తు చేసుకున్నాడు.

"నాన్నగారూ! యుద్ధం అయిపోయిన తరువాత వచ్చి, ఇంటిని మరమ్మత్తు చేయడంలో మీకు సాయపడతాను..." – ఆ రోజే డ్యూటీకి వెళ్లిపోయాడు.

ఇక ఇప్పుడు అది జరిగే పని కాదు!

రస్వీందర్ అమరుడైన నాటి నుండీ ప్రతి రోజూ ఎవరో ఒకరు హర్‌చరణ్ ఇంటికి వచ్చి ఓదార్చిపోతూనే ఉన్నారు.

కుటుంబ మిత్రుడు, 85 సంవత్సరాల మాజీ సైనికుడు తార్లోక్‌సింగ్ మాత్రం ప్రతిరోజూ వస్తూ ఉండడంతో హర్‌చరణ్‌సింగ్‌కి ఊరటగా ఉంది.

అతను రస్వీందర్ ఫొటో చూస్తూ "నేను పింఛనుదారుగా మాత్రమే మరణిస్తాను. రస్వీందర్ మాత్రం అమరవీరునిగా దేశప్రజల మనసుల్లో కలకాలం బ్రతికే ఉంటాడు..." అన్న మాటలు అక్షరసత్యాలు.

ఏమిచ్చి ఈ అమరవీరుల రుణం తీర్చుకోగలం? అను నిత్యం వారి త్యాగాలను స్మరిస్తూ, స్మృతి నీరాజనాలర్పించడం తప్ప... అవే వీరస్వర్గంలో ఉన్న అమరవీరులకు ఆనందం కలిగిస్తాయి.

*(ఈ రచన 'టైగర్‌హిల్'కి రమేశ్ వినాయక్ వార్తా కథనం, బన్‌దీప్‌సింగ్ ఫొటోలు ఆధారం. వారిరువురికీ అభినందన పూర్వక కృతజ్ఞతలు. – రచయిత)*